విరుల వైభోగం.. అతివ ఆనందం



ఎంగిలిపూల బతుకమ్మ వేడుక సందర్భంగా పెద్దపల్లిలో ఆడుతున్న మహిళలు

మహాత్ముడి జీవనం అందరికీ ఆదర్శం


పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మాగాంధీ జీవన విధానం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. బుధవారం మహాత్ముడి జయంతి సందర్భంగా సమీకృత పాలనా ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సత్యం, అహింసలనే ఆయుధాలుగా మలచుకొని గాంధీజీ అనేక విజయాలు సాధించారని కలెక్టర్ కొనియాడారు. ఈ సందర్భంగా గాంధీజీ స్మారకనిధి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ లాల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



గాంధీ జయంతి వేడుకల్లో కలెక్టర్ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్, అధికారులు

వంట నూనెలు సలసల

- పక్షం రోజుల్లో లీటరుకు రూ.20కు పైగా పెంపు
- ఉమ్మడి జిల్లాపై రూ.6.80 కోట్ల భారం



న్యూస్‌టుడే, పెద్దపల్లి

దసరా పండుగ వేళ వంట నూనెల ధరలు పెరగడం మధ్యతరగతి కుటుంబాలకు శరాఘాతంగా మారింది. దిగుమతులపై ప్రభుత్వం సుంకం పెంచిన నేపథ్యంలో కంపెనీలు ధరలను గణనీయంగా పెంచేశాయి. పదిహేను రోజుల వ్యవధిలో ఒక్కో కంపెనీ ఒక్కో రకంగా పెంచడంతో లీటరు నూనెపై రూ.20-30 వరకు భారం పడింది.

పదిహేను రోజుల్లోనే పైపైకి

వంట నూనెల దిగుమతి సుంకాన్ని 20 శాతం పెంచుతూ కేంద్ర ప్రభుత్వం సెప్టెంబరు 13న నిర్ణయం తీసుకుంది. దీంతో రష్యా, ఉక్రెయిన్ యుద్ధం మొదలైన రోజుల మాదిరిగా ధరలు పరుగులు తీశాయి. పక్షం రోజుల వ్యవధిలోనే లీటరు ధర పొద్దుతిరుగుడు రూ.130కు, పామోలిన్ రూ.125కు చేరింది. గత నెల 13వ తేదీతో పోలిస్తే ఒక్కో లీటరుపై రూ.20 వరకు పెరిగింది. కొద్ది రోజుల్లో మరో రూ.5 వరకు పెరిగే అవకాశముంది. ఈ ధరల పోటీలో ఒకటి రెండు ప్రముఖ కంపెనీలు సంయమనం పాటించగా మిగతా కంపెనీలు మాత్రం పరుగులు పెట్టిస్తున్నాయి.

దేశీ ఉత్పత్తులపైనా..

దేశీయంగా తయారయ్యే సోయాబీన్, వేరుశనగ, రైస్‌బ్రాన్ తదితర నూనెల ధరలు కూడ విదేశీ ఉత్పత్తులతో సమానంగా పెంచేశారు. సెప్టెంబరు 10 వరకు లీటరు రైస్‌బ్రాన్ నూనె ప్యాకెట్ రిటైల్ ధర రూ.120 వరకుండగా ప్రస్తుతం రూ.135కు పెరిగింది. పల్లి నూనె ధర రూ.150 నుంచి రూ.160కి పెంచేశారు. కొన్ని కంపెనీలు మాత్రం ధరల పెరుగుదల తీవ్రత తెలియొద్దనే ఉద్దేశంతో పరిమాణాన్ని తగ్గించి విక్రయిస్తున్నాయి. దిగుమతి సుంకం పరిధిలోకి రాని దేశీయ నూనెల ధరలను సైతం పెంచడంతో సామాన్యులకు భారంగా మారింది.

అత్యధికంగా పొద్దుతిరుగుడు

ఉమ్మడి జిల్లాలో గృహ, వాణిజ్య అవసరాల కోసం ప్రతి నెలా 3400 మెట్రిక్ టన్నుల వంట నూనె వినియోగం జరుగుతోంది. ఇందులో అత్యధికంగా పొద్దుతిరుగుడు 2040 మెట్రిక్ టన్నులు, పామోలిన్ 840 మెట్రిక్ టన్నులు, వేరుశనగ, తవుడు, ఇతర నూనెలు 520 మెట్రిక్ టన్నులుంటాయి. సెప్టెంబరు 10 వరకు ఒక నెలకు సరిపడా నూనె కొనుగోలు చేసేందుకు వినియోగదారులు రూ.37.40 కోట్లు వెచ్చించగా, ప్రస్తుతం రూ.44.20 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. సగటు ధర ఆధారంగా లెక్కించిన గణాంకాలే ఇవి. రోజువారీగా మారుతున్న ధరలను పరిగణనలోకి తీసుకుంటే భారం మరింత ఎక్కువగా ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో నూనెల వాడకం, పెరిగిన ధరల ప్రభావం

నూనె రకం	పరిమాణం (మెట్రిక్ టన్నుల్లో)	గతంలో వెచ్చించిన మొత్తం (రూ.కోట్లలో)	పెరిగిన భారం (రూ.కోట్లలో)
పొద్దుతిరుగుడు	2040	27.54	4.08
పామోలిన్	840	10.08	1.68
వేరుశనగ, రైస్‌బ్రాన్ తదితరాలు	520	7.80	1.04

పౌష్టికాహారంతో ఆరోగ్య సమాజం

'పోషణ్ మహా' ముగింపు కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు



గర్భిణులకు పండ్లు, దుస్తులు అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో కలెక్టర్ శ్రీహర్ష

మంథని, న్యూస్‌టుడే : పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. బుధవారం మంథనిలో నిర్వహించిన 'పోషణ్ మహా' ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టినప్పటి నుంచి ఆరేళ్ల వరకు పిల్లలకు సరైన పౌష్టికాహారం అందితే ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణమవుతుందన్నారు. ఇదే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పోషణ్ మహా-24 కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. కరోనా సమయంలో అంగన్‌వాడీ సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఉపాధ్యాయినులు, సహాయకుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బందితో ఏర్పాటు చేసిన ప్రదర్శనను మంత్రి తిలకించారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీహర్ష, ఆర్డీవో హనుమానాయక్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రవూఫ్‌ఖాన్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాదేవి, సింగిల్‌విండో ఛైర్మన్ శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీవో పుష్పలత పాల్గొన్నారు.

పకడ్బందీగా డిజిటల్ కార్డులు

సన్నాహక సర్వేకు రంగం సిద్ధం



ఈనాడు, కరీంనగర్

కుటుంబ డిజిటల్ కార్డుల జారీకి రంగం సిద్ధమైంది.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇంటిల్లిపాది సమాచారాన్ని ఒకేచోట క్రోడీకరించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. గురువారం నుంచి ఉమ్మడి జిల్లాలోని ఎంపిక చేసిన పల్లెలు, వార్డులకు అధికారులు, సిబ్బంది వెళ్లి కుటుంబంలోని మహిళ పేరుతో జారీ చేసే కొత్త డిజిటల్ కార్డుకు అవసరమైన సమాచారాన్ని సేకరించనున్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారులు అందించిన మార్గదర్శకాల ప్రకారం నాలుగు జిల్లాల పరిధిలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 24 ప్రదేశాల్ని ఎంపిక చేశారు. నియోజకవర్గ కేంద్రంలోని ఒక వార్డుతోపాటు ఆ నియోజకవర్గ పరిధిలోని ఒక గ్రామాన్ని సన్నాహక సర్వే (పైలట్ ప్రాజెక్టు)కు ఎంచుకున్నారు. ఈ నెల 7వ తేదీ వరకు రోజూ నివాస గృహాల వారీగా పూర్తిస్థాయి వివరాలు తెలుసుకోనున్నారు. నియోజకవర్గానికి ఆర్డీవో లేదా జిల్లాస్థాయి ఉన్నతాధికారిని నోడల్ అధికారిగా నియమించారు. వీరి పర్యవేక్షణలో ప్రతి గ్రామానికి బృంద నాయకుడిగా ఎంపీడీవో, సభ్యులుగా ఇతర అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్ల సేవల్ని వినియోగించుకునే ఏర్పాట్లు చేశారు.

ప్రక్రియ తీరిలా..!

- ఉమ్మడి జిల్లాలో 5,359 ఇళ్లకు సన్నాహక సర్వేలో భాగంగా ఈ డిజిటల్ కార్డుని అందించనున్నారు. ఈ కుటుంబాల్లో ఉన్న సుమారు 16వేల మందికి పైగా సభ్యుల పూర్తి వివరాలు తెలుసుకుని ఆన్‌లైన్‌లో పొందుపర్చనున్నారు.
- సర్వేలో భాగంగా ఇంటి యజమానురాలితోపాటు సభ్యులకు సంబంధించిన వివరాల్ని తప్పులు లేకుండా నమోదు చేస్తారు. వారికి ఉన్న ఆరోగ్యకార్డులు ఇతర వివరాల్ని నమూనా పత్రంలో పొందుపరుస్తారు.
- ముఖ్యంగా రేషన్‌కార్డు సంఖ్య సహా ఆరోగ్య సమాచారాన్ని సమగ్రంగా తీసుకోనున్నారు. పింఛన్ లబ్ధిదారు, స్వయం సహాయక సంఘం సభ్యులు, రైతు భరోసా, రుణమాఫీ, ఆరోగ్యశ్రీ ఇలా అన్నింటి వివరాలు సేకరిస్తారు.
- కుటుంబ సభ్యులు సమ్మతిస్తేనే వారి అందరి ఫొటోను తీసుకుంటారు.
- అన్ని వివరాల సేకరణ తరువాత ఈ డిజిటల్ కార్డుపై ప్రత్యేకమైన నంబరును కేటాయించనున్నారు.
- 200ల లోపు కుటుంబాలు ఉన్న గ్రామాలు, 500ల ఇళ్లలోపు ఉన్న వార్డులను మాత్రమే ప్రస్తుతం ఎంపిక చేశారు.
- కలెక్టర్లు ఈ అయిదు రోజులు ప్రత్యేక పరిశీలన చేపట్టనున్నారు.
- వివరాలెలా సేకరించాలనే విషయమై సిబ్బందికి ప్రత్యేకంగా తర్ఫీదునిచ్చారు. ఎక్కడా తప్పులకు ఆస్కారం లేకుండా పలు అంశాల్ని పొందుపరుస్తారు. సవరణలకు అవకాశాన్ని కల్పించనున్నారు.

ఎంపికైన వార్డులు, గ్రామాలు

పట్టణం	వార్డు	కుటుంబాలు	గ్రామం/మండలం	కుటుంబాలు
రామగుండం	48	782	గుడిపల్లె (పాలకుర్తి)	157
మంథని	13	220	ధరియాపూర్ (ముత్తారం)	108
పెద్దపల్లి	24	288	దుబ్బపల్లి (సుల్తానాబాద్)	145
సిరిసిల్ల	25	350	రామోజీపేట (ఇల్లంతకుంట)	170
వేములవాడ	19	162	బొల్లారం (వేములవాడ గ్రామీణం)	162
కోరుట్ల	18	321	సర్ఫరాజ్‌పల్లి (కోరుట్ల)	150
జగిత్యాల	9	200	వడ్డెర కాలనీ (జగిత్యాల గ్రామీణం)	159
ధర్మపురి	4	264	అబ్బాపూర్ (గొల్లపల్లి)	180
కరీంనగర్(కొత్తపల్లి)	12	232	తాహెర్ కొండాపూర్ (కరీంనగర్ గ్రామీణం)	140
చొప్పదండి	7	235	కోనేరుపల్లి (చొప్పదండి)	180
హుజూరాబాద్	12	279	పాపాయపల్లి (జమ్మికుంట)	165
మానకొండూర్	-	-	నేదునూరు (తిమ్మాపూర్)	139
			అర్కండ్ల(శంకరపట్నం)	171

సొంతింటి కల నెరవేరేనా!

ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి ప్రకటనతో పేదల్లో ఆశలు

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో మరో అడుగు పడింది. దసరా తర్వాత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపడతామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించడంతో అర్హుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వం చేపట్టిన గృహలక్ష్మి పథకాన్ని కాంగ్రెస్ సర్కారు రద్దు చేసింది. అప్పట్లో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల పంపిణీ ప్రహసనంగా మారింది. ఎట్టకేలకు తొమ్మిది నెలల నిరీక్షణకు తెర పడనుంది. త్వరలో ఇళ్లకు దరఖాస్తులు స్వీకరించనుండటంతో పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

తొలి విడతలో 10,500 మందికి లబ్ధి

గత ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తులు స్వీకరించగా జిల్లావ్యాప్తంగా 33,816 మంది అర్జీలు పెట్టుకున్నారు. అధికారులు వీటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించగా 25,040 మందిని అర్హులుగా గుర్తించారు. వీరిలో కొందరికి మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాన్ని రద్దు చేసింది. ప్రస్తుతం తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేయనున్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 10,500 మందికి గృహ యోగం దక్కనుంది.

రెండు పడక గదుల గృహాలకు ఆందోళన

జిల్లాలో రూ.17,724.96 కోట్లతో 3,394 రెండు పడక గదుల ఇళ్లకు ప్రతిపాదించారు. పెద్దపల్లి పట్టణం రాంపెల్లి, చందపల్లిలలో 484, రామగుండం ఫైవింక్లయిన్, మల్కాపూర్‌లలో 660 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా లబ్ధిదారులను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. మంథని పట్టణంలోని పోచమ్మవాడలో 238 నిర్మాణాలు ప్రారంభించగా 94 మాత్రమే పూర్తయ్యాయి. 74 ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మిగతావి అసంపూర్తిగా ఉన్నాయి. పెద్దపల్లిలో గృహాలను లబ్ధిదారులకు కేటాయించగా ప్రస్తుతం చిన్న చిన్న పనులు చేస్తున్నారు. ఇళ్లు కేటాయించాలంటూ రామగుండం లబ్ధిదారులు తరచూ కలెక్టరేట్‌కు వస్తుండగా నెల రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయనున్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రామగుండం వాసులు (పాతచిత్రం)

దసరా తర్వాత అర్జీల స్వీకరణ

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇప్పటికే కొంత స్పష్టత వచ్చింది. తొలుత సొంత జాగా కలిగిన ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు, ఇతరులకు రూ.5 లక్షల చొప్పున నిర్మాణానికి అందించనున్నారు. ప్రజాపాలన, ప్రజావాణి, మండల స్థాయిలో స్వీకరించిన మొత్తం 7,240 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. లబ్ధిదారుల ఎంపిక కోసం వార్డు, గ్రామ, పట్టణ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీల్లో అధికారులు, ప్రజాప్రతినిధులకు స్థానం కల్పించనున్నారు. దసరా తర్వాత అర్జీలు స్వీకరించనున్నారు.

చట్ట వ్యతిరేక పోస్టులు పెడితే చర్యలు

గోదావరిఖని, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల్లో చట్ట వ్యతిరేక పోస్టులు పెట్టే వారిపై చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అవసరమైతే వారిపై పీడీ చట్టం కింద కేసులు నమోదు చేస్తామన్నారు. కొంత మంది రాజకీయ నాయకులను లక్ష్యంగా చేసుకుని రెచ్చగొట్టేలా, మతానికి సంబంధించిన వివాదాలు సృష్టించే విధంగా పోస్టులు పెడుతున్నారన్నారు. దీనికోసం ప్రత్యేకంగా కమిషనరేట్‌లో సామాజిక మాధ్యమాల ట్రాకింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని.. నిరంతరం నిఘా ఉంటుందన్నారు.

జాగ్రత్తలు పాటించి ఊరెళ్లండి

గోదావరిఖని: దసరా సెలవుల్లో ఊరికి వెళ్లేవారు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ శ్రీనివాస్ సూచించారు. ఊరికి వెళ్లేవారు ఇంట్లో విలువైన బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులు ఉంచకూడదని.. వాటిని బ్యాంకు లాకర్లలో లేదా ఏదైనా రహస్య ప్రదేశాల్లో దాచుకోవాలన్నారు. సీసీ కెమెరాలు, ఇంటికి సెంట్రల్ లాక్ విధానం, సెక్యూరిటీ అలారం, సెన్సార్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

కొమెర యువకుడికి డీఎస్సీలో జిల్లా స్థాయి మొదటి ర్యాంకు



ప్రశాంత్

ఓదెల, న్యూస్‌టుడే: ఓదెల మండలం కొమెరకు చెందిన కొత్తిరెడ్డి ప్రశాంత్ డీఎస్సీలో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. కొత్తిరెడ్డి రాజిరెడ్డి, వనజ దంపతుల కుమారుడైన ప్రశాంత్ మొదటి ప్రయత్నంలోనే స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో 74 మార్కులతో ప్రతిభ కనబరిచారు. వ్యాయామ ఉపాధ్యాయుడిగా గ్రామీణ పేద విద్యార్థులను క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన చెప్పారు.

గనుల విస్తరణ.. కార్మికుల రక్షణ

- అవగాహనతో ప్రమాదాలకు అడ్డుకట్ట
- అయిదు ప్రాజెక్టులతో కోల్‌మైన్ ఏర్పాటు
- ఆర్జీ-3 జీఎం సుధాకరరావు

ముఖాముఖి



సింగరేణి గనుల విస్తరణతో పాటు కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నామని ఆర్జీ-3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు తెలిపారు. గనుల్లో ప్రమాదాల నివారణకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పలు అంశాలపై 'న్యూస్‌టుడే'తో ఆయన మాట్లాడారు.

–న్యూస్‌టుడే, కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), మంథని

ప్రశ్న: సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి పునరావాస కాలనీ వరకు రెండు కిలోమీటర్ల మేర గతంలో సంస్థ నిర్మించిన రహదారి విస్తరణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సమాధానం: రహదారిపై గుంతలను వారంలోగా పూడ్చివేస్తాం. రోడ్డు విస్తరణ పనులను ఆర్అండ్‌బీ అధికారులకు అప్పగిస్తాం.

ప్ర: అక్కెపల్లి పునరావాసకాలనీ పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారు?

స: కాలనీలో అన్ని వసతులూ కల్పిస్తాం. తాగునీటి పైపులైన్లు, వీధి దీపాల పనులను నిర్వాసితులు ఇళ్లు నిర్మించుకున్నాక పూర్తి చేస్తాం. దొంగల బెడదలో ఈ పనులు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. 18 ఏళ్లు నిండిన భూ నిర్వాసితులకు స్పెషల్ ఎక్స్‌గ్రేషియా కింద రూ.3.70 లక్షలు చెల్లించాల్సి ఉంది. వయసు నిర్ధారణ కోసం ధ్రువపత్రాలను పరిశీలిస్తున్నాం.

ప్ర: డివిజన్ పరిధిలో గనుల విస్తరణపై భవిష్యత్తు ప్రణాళిక ఏమిటి?

స: ఓసీపీ-1, 2, ఏఎల్‌పీ, వకీలుపల్లి, జీడీకే-10 ఇన్‌క్లైయిన్ గనులతో కలిపి ఆర్జీ కోల్‌మైన్ పేరుతో తీర్చిదిద్దడానికి ప్రణాళిక రూపొందిస్తున్నాం. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులు రావాలి. 2042 వరకు వీటికి భవిష్యత్తుంటుంది.

ప్ర: బుధవారంపేట గ్రామానికి చెందిన 708 ఎకరాలను సంస్థ సేకరించి తిరిగిచ్చింది. ప్రస్తుతం రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తించడం లేదు.

స: 2012లో భూసేకరణ కోసం జిల్లా యంత్రాంగానికి సంస్థ రిక్విజేషన్ ఇచ్చింది. తర్వాత రూ.38 కోట్లు డిపాజిట్ చేయగా భూ సేకరణాధికారి సింగరేణికి అవార్డు పాస్ చేశారు. భూములు సంస్థ పేరు మీదకు మారడంతో రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తించలేదు. సర్వే నెంబర్లపై భూసేకరణ చేపట్టడంతో వారు కోర్టులను ఆశ్రయించారు. కోర్టు భూసేకరణ ప్రక్రియను కొట్టేసింది. కోర్టు ఆదేశాల మేరకు రైతుల పేర్ల మీదకు భూములను మారుస్తున్నారు. ఇప్పటివరకు 350 ఎకరాలు రైతుల పేర్ల మీదకు బదిలీ అయ్యాయి. మిగతా 358 ఎకరాలను త్వరలో బదిలీ చేయడానికి కలెక్టర్ చొరవ చూపుతున్నారు.

ప్ర: నివాస గృహాలు, మురుగుకాలువలు, అంతర్గత రహదారులు శిథిలావస్థకు చేరినా మరమ్మతు చేయడం లేదని కార్మికులంటున్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

స: కార్మికుల దరఖాస్తుల ఆధారంగా క్వార్టర్ల మరమ్మతు చేపడుతున్నాం. కొత్త పైపులైన్లతో పాటు డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. ఆరు నెలల్లో అంతర్గత రహదారుల నిర్మాణం పూర్తి చేస్తాం. ఆర్జీ-1 నుంచి యైటింక్లయిన్‌కాలనీ మీదుగా ఆర్జీ-3 ప్రాంతానికి పైపులైన్లు వేయడంతో సరఫరాకు ఎక్కడ అంతరాయం ఏర్పడినా చివరి ప్రాంతమైన సెంటినరీకాలనీకి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. తాగునీరు ఎక్కడా కలుషితం కావడం లేదు.

ప్ర: ఇటీవలి కాలంలో గనుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రక్షణ చర్యలు సక్రమంగా పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

స: ప్రమాద ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలు చేపడుతున్నాం. ప్రమాదాల నివారణపై కార్మికులకు అవగాహన కల్పిస్తున్నాం. కాంట్రాక్టు కార్మికులకు శిక్షణ ఇస్తూ రక్షణ పరికరాలు అందిస్తున్నాం.

ప్ర: ఆర్జీ-3 పరిధిలో సౌర విద్యుదుత్పత్తి ఎలా ఉంది? దీనిపై భవిష్యత్తు ప్రణాళిక?

స: ముల్కలపల్లి సమీపంలో 50 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్లాంటు ప్రారంభించి పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేస్తున్నాం. ఓసీపీ-1 ఓబీ డంపుపై 22 మెగావాట్ల ప్లాంట్ పనులు చివరి దశలో ఉన్నాయి. మూడు నెలల్లో ఉత్పత్తి ప్రారంభమవుతుంది. అక్కడే మరో 37 మెగావాట్ల సౌర విద్యుత్తు కేంద్రం ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

ప్ర: ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో అవకతవకలు జరిగాయని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు కదా!

స: ప్యాకేజీ చెల్లింపుతో సింగరేణికి సంబంధం లేదు. ప్రభుత్వం చేపట్టే భూ సేకరణ ఆధారంగానే నిర్వాసితులకు పరిహారం చెల్లింపు ఉంటుంది. అవకతవకలపై చర్యలు తీసుకోవాల్సింది సేకరణాధికారినే.

సమష్టి కృషితోనే రాజకీయ చైతన్యం

పెద్దపల్లి, న్యూస్‌టుడే: రాజకీయంగా ఎదిగేందుకు కలిసికట్టుగా పని చేయాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్‌పటేల్ పిలుపునిచ్చారు. పెద్దపల్లిలో బుధవారం నిర్వహించిన మున్నూరు కాపు గర్జన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ పార్టీలకు చెందిన ముకాస నాయకుల అభిప్రాయాలు తీసుకొని గర్జన సదలం సమయాన్ని ప్రకటించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని 14 మండలాలకు చెందిన గ్రామ సంఘాల బాధ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)
గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73542
మంథని : 99122 68471

న్యూస్‌టుడే, సుల్తానాబాద్

? సుల్తానాబాద్ పట్టణం నుంచి నీరుకుళ్లకు వెళ్లే మార్గంలో ఎస్సారెస్పీ కాలువ వద్ద జంతు కళేబరాలు, వ్యర్థాలు పడేస్తుండటంతో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఉదయం నడకకు వెళ్లేవారు కుక్కలతో భయభ్రాంతులకు గురవుతున్నారు. -వెంకటేశం, గ్రామస్థుడు

✔ సుల్తానాబాద్ పురపాలక సంఘం పరిధిలో కుక్కలు, కోతుల బెడద తొలగింపునకు కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసి జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించాం. జంతు వ్యర్థాల పారవేయడంపై సిబ్బందితో నిఘా ఉంచి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం -గాజుల లక్ష్మి, పుర ఛైర్‌పర్సన్

జూదరుల అరెస్టు

జైపూర్, న్యూస్‌టుడే : ఇందారం గ్రామంలోని దొరగారిపల్లెలో బుధవారం జూద స్థావరంపై టాస్క్‌ఫోర్స్, జైపూర్ పోలీసులు దాడులు చేశారు. ఈ క్రమంలో ఇందారం గ్రామానికి చెందిన ఒకరు, గోదావరిఖనికి చెందిన ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.7,935 నగదు, 5 చరవాణులు, 1 ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

సంతానం లేదని మనస్తాపంతో రైతు ఆత్మహత్య


సమ్మయ్య

ఓదెల, న్యూస్‌టుడే: పిల్లలు లేరన్న మనస్తాపంతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఓదెల మండలకేంద్రంలో చోటుచేసుకుంది. పొత్కపల్లి ఎస్సై జి.అశోక్‌రెడ్డి కథనం ప్రకారం ముద్దసాని సమ్మయ్య(48)కు పెళ్లయి ఇరవై ఏళ్లయినా పిల్లలు లేరు. కొన్నేళ్లుగా మద్యానికి బానిసైన అతడు సెప్టెంబరు 29న ఇంట్లో పురుగుల మందు తాగాడు. కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. సమ్మయ్య నేత్రాలను కుటుంబ సభ్యులు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దానం చేశారు. వారిని ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మేర్గు భీష్మాచారి అభినందించారు.

ఎస్సారెస్పీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: ఆరెపెల్లి శివారు ఎస్సారెస్పీ కాలువలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకురావడాన్ని స్థానిక రైతులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఆరా తీస్తున్నారు.

శాంతియుత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బారెడ్డి

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: గొడవలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో దసరా ఉత్సవాలు జరుపుకోవాలని సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కాల్వశ్రీరాంపూర్ గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతా కలిసిమెలిసి స్నేహపూరిత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా జమ్మిచెట్టు గద్దె ప్రాంతాన్ని సీఐ పరిశీలించారు. నాయబ్ తహసీల్దార్ గర్రెపెల్లి శంకర్, ఎంపీవో గోవర్ధన్, ఎస్సై వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి తదితరులున్నారు.

కేవీపీఎస్ ఆవిర్భావ వేడుకలు


జెండా ఎగురవేస్తున్న అశోక్

పెద్దపల్లి, న్యూస్‌టుడే: కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి(కేవీపీఎస్) ఆవిర్భావ వేడుకలు బుధవారం పెద్దపల్లిలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, సంస్థ జెండాను ఆవిష్కరించారు. కుమ్మరి నవీన్, వెంకటస్వామి, శ్రీనివాస్, నర్సయ్య, ఇమ్రాన్, ఆదిత్యలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి


రహదారి మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి శాసనసభ్యుడు సీహెచ్.విజయ రమణారావు కృషి చేస్తున్నారని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ పేర్కొన్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలం ఆశన్నపల్లి నుంచి మంగపేట వాగు రహదారికి రూ.2 లక్షలు, అంకంపల్లి నుంచి దావన్నపల్లెకు రూ.2 లక్షల నిధులతో చేపట్టిన మరమ్మతు పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. మండలంలో వర్షాలతో పాడైన రోడ్ల మరమ్మతుకు రూ.10 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు సదయ్య, తిరుపతిరెడ్డి, సదానందం, సతీష్, వెంకన్న మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణపై గ్రామసభలు

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం మండలంలో గ్రామ సభలు నిర్వహించారు. స్థానిక సమస్యలతో పాటు బతుకమ్మ, దసరా ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. మాజీ ఎంపీపీలు గోపగోని సారయ్యగౌడ్, నూనేటి సంపత్, నాయబ్ తహసీల్దార్ గర్రెపెల్లి శంకర్, నాయకులు, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో..


మంథనిలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న భారాస నాయకులు


ధర్మారంలో ఆర్యవైశ్యులు..


సుల్తానాబాద్‌లో..


జూలపల్లిలో..

మహాత్ముడికి ఘన నివాళి

జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం జిల్లావ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో ఆయనకు ఘన నివాళులర్పించారు. గాంధీజీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. -న్యూస్‌టుడే బృందం


కమాన్‌పూర్ మార్కెట్ ఆవరణను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు


గాంధీ చిత్రపటం వద్ద సీపీ శ్రీనివాస్, పోలీసు అధికారులు


ఖని: మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎన్టీపీసీ ఈడీ కేదార్‌రంజన్‌పాండు


పాలకుర్తిలో గాంధీ చిత్రపటానికి నమస్కరిస్తున్న గ్రామస్థులు


ముత్తారంలో..

గని కార్మికుల క్రికెట్ పోటీలు

గోదావరిఖని: సింగరేణి జీడీకే-1 గని కార్మికుల క్రికెట్ పోటీలు బుధవారం ఆసక్తిగా సాగాయి. స్థానిక పీజీ కళాశాల క్రీడా మైదానంలో 8 జట్లుగా ఏర్పడి పోటీపడ్డారు. వీటిని ఏఐటీయూసీ నాయకులు ఎల్లయ్య, శ్రీనివాస్‌లు ప్రారంభించారు.



సంస్థకు కష్టకాలం.. చేరని లక్ష్యం

సాధించాల్సిన ఉత్పత్తి 43.56 మిలియన్ టన్నులు

గోదావరిఖని, న్యూస్‌టుడే

ఈ ఏడాది సాధించాల్సిన లక్ష్యాన్ని సింగరేణి చేరుకోలేకపోయింది. అర్ధ సంవత్సరంలో 28.44 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించింది. రానున్న ఆరు నెలల్లో ఇంకా 43.56 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించుకుంది. సింగరేణి వ్యాప్తంగా కేవలం రెండు డివిజన్లు మాత్రమే వంద శాతానికి మించి బొగ్గు ఉత్పత్తి చేశాయి. సెప్టెంబరులో వర్షాలు ఎక్కువగా కురియడంతో ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది.

పనుల నిలిపివేత..

కొన్ని గనుల్లో ప్రైవేటు కాంట్రాక్టు కంపెనీలు పనులు నిలిపివేయడంతో ఉత్పత్తిపై ప్రభావం పడింది. గతనెలలో 31.58 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకున్నప్పటికీ.. కేవలం 28.44 మిలియన్ టన్నుల ఉత్పత్తి మాత్రమే చేపట్టింది. బొగ్గు డిమాండ్ అధికంగా ఉన్నప్పటికీ.. ప్రకృతితోపాటు సంస్థాగతంగా ఎదురవుతున్న ఇబ్బందులతో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది.


బొగ్గు నింపుతున్న షావల్ యంత్రం

కొండంత భారం..

రానున్న ఆరు నెలల్లో అత్యధికంగా బొగ్గు ఉత్పత్తి చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం రోజుకు 1.5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తున్న సింగరేణి.. రానున్న కాలంలో దానికి రెట్టింపు ఉత్పత్తి చేస్తేనే నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని చేరుకునే అవకాశముంది. అంటే నెలకు 7 మిలియన్ టన్నుల కంటే అధికంగా ఉత్పత్తి చేయాల్సి ఉంది.

కొత్త గనులు అందుబాటులోకి వస్తేనే..

ఈ ఏడాదిలో కొత్తగా ప్రారంభించనున్న గనులు అందుబాటులోకి వస్తేనే వార్షిక లక్ష్యాన్ని అధిగమించేందుకు అవకాశముంది. ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకుతోపాటు కొత్తగూడెంలోని వీకే ఓసీపీ, ఇల్లెందులోని రొంపేడు ఓసీపీ, బెల్లంపల్లి ప్రాంతంలోని గోలేటి ఓసీపీల్లో పనులు ప్రారంభిస్తే ఉత్పత్తి పెరగనుంది. ప్రస్తుతం కొన్ని గనులకు ప్రభుత్వ పరంగా క్లియరెన్సులు, అటవీశాఖ అనుమతులు రావాల్సి ఉంది. రామగుండంలోనూ కొత్తగా మెగా ఓసీపీ ప్రారంభించేందుకు యాజమాన్యం ప్రణాళికలు చేసుకుంది. ఒడిశాలోని నైనీ బొగ్గుబ్లాకులో ఉత్పత్తి ప్రారంభించేందుకు సిద్ధమైంది.

గర్భిణులకు మెరుగైన సేవలందించాలి


ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

మంథని, న్యూస్‌టుడే: మంథని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు మెరుగైన సేవలందించాలని కలెక్టర్ శ్రీహర్ష సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన కేంద్రాన్ని సందర్శించి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆశా కార్యకర్తలు గర్భిణులను క్రమం తప్పకుండా మానిటరింగ్ చేయాలని సూచించారు. రూ.36 లక్షలతో చేపట్టిన ప్రహరీ నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ మనోహర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: అప్పన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎ.మణికంఠ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ వేల్పుల సురేందర్ తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం విద్యార్థిని అభినందించారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో మణికంఠ ప్రతిభ కనబరిచారు.

కళాకారుడికి సన్మానం

ముత్తారం, న్యూస్‌టుడే: ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన కలవేన రవియాదవ్‌ను మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి అభినందించారు. సెప్టెంబరు 29న తిరుపతిలో శ్రీ స్వరవాణి కల్చరల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన కార్యక్రమంలో రామాయణ ప్రదర్శనలో రవియాదవ్ లక్ష్మణుడి పాత్ర పోషించారు. ఈ సందర్భంగా నేషనల్ యూనిక్ అవార్డు అతడికి రాగా బుధవారం మాజీ ఎంపీపీతో పాటు గ్రామస్థులు సన్మానించారు.

లాల్‌బహదూర్‌శాస్త్రికి నివాళి


మాజీ ప్రధానికి నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

మంథని, న్యూస్‌టుడే: మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా బుధవారం మంథని భాజపా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యప్రకాష్, శ్రీనివాస్, సంతోష్, సతీష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బందికి సత్కారం


కార్మికుడికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఛైర్‌పర్సన్ రమాదేవి

మంథని, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం మంథని మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బందిని ఛైర్‌పర్సన్ రమాదేవి సన్మానించారు. అంతకుముందు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌ఛార్జి కమిషనర్ మనోహర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధం


కమాన్‌పూర్‌లో పూర్తయిన మండపం

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో దుర్గామాత శరన్నవరాత్రోత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి మండపాలను సుందరంగా తీర్చిదిద్దారు. గురువారం నుంచి అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించనున్నారు. కమాన్‌పూర్‌లోని ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో వేసిన మండపం ఆహుతులను ఆకట్టుకుంటోంది.


పెద్దపల్లిలో బతుకమ్మతో చిన్నారి


సుల్తానాబాద్ వేణుగోపాలస్వామి ఆలయంలో..


మంథని గాంధీచౌక్ వద్ద..

ఒక్కేసి పువ్వేసి.. ఊరంతా మురిసి

ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు బుధవారం జిల్లావ్యాప్తంగా కన్నుల పండువగా జరిగాయి. పట్టణాల్లోని విపణుల్లో తంగేడు, గునుగు, సీతమ్మ జడ, బంతి, చామంతి, గుమ్మడి, తామర తదితర పూల అమ్మకాలు జోరుగా సాగాయి. ఊరూరా రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను ఆలయాల్లో, కూడళ్ల వద్ద ఉంచి అతివలు ఆడిపాడారు. అనంతరం బావులు, చెరువుల్లో నిమజ్జనం చేసి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. పంచాయతీలు, కాలనీ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. -న్యూస్‌టుడే బృందం


ఓదెలలో..


ధర్మారంలో..


పెద్దపల్లిలో..


కమాన్‌పూర్: కిష్టంపల్లిలో..


ఖని: బతుకమ్మ ఆడుతున్న మహిళలు


ఖని: రాజ్యలక్ష్మి కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సంక్షిప్తం

రైల్వే కార్మికులకు బోనస్ చెల్లించాలి

పాలకుర్తి(రామగుండం): రైల్వే కాంట్రాక్టు కార్మికులకు చట్టపరంగా బోనస్ చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి రామాచారి కోరారు. రామగుండంలోని పలు విభాగాల్లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు ఈనెల 1 నుంచి పెరిగిన డీఏతో కలిపి వేతనాలు చెల్లించాలని కోరుతూ బుధవారం రైల్వే డిపో ఏడీఎంఈ మల్లిఖార్జున్‌రావుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు భిక్షపతి, నాయకులు పాల్గొన్నారు.

సేవా సమితి అన్నదానం

జ్యోతినగర్(మార్కండేయకాలనీ): ఎన్టీపీసీ మేడిపల్లి కేంద్రం సమీపంలో శ్రీవాసవి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఏటా అమావాస్య సందర్భంగా నిరుపేదలకు అన్నదానం చేపడుతున్నామని సమితి వ్యవస్థాపకులు పేర్కొన్నారు. సభ్యులు రాజు, వెంకటేశ్వర్లు, సురేష్, ఈశ్వరయ్య తదితరులున్నారు.

సర్వేకు గుడిపల్లి ఎంపిక

పాలకుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుటుంబ డిజిటల్ కార్డుల సర్వే పైలట్ ప్రాజెక్టులో భాగంగా.. మండలంలోని గుడిపల్లి గ్రామం ఎంపికైనట్లు ఎంపీడీవో శశికళ బుధవారం తెలిపారు. గురువారం ఎంపీడీవో ఆధ్వర్యంలో సర్వే చేయనున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలందరూ తమ కుటుంబసభ్యులతో ఇంటి వద్దే ఉండాలని కోరారు.

కాలనీలో ఎంగిలిపూల బతుకమ్మ

యైటింక్లయిన్‌కాలనీ: కాలనీలో బుధవారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను మహిళలు నిర్వహించారు. కాలనీలోని టీ1, టీ2, బంగ్లోస్‌ఏరియా, షిర్కే ఆవరణలో ఆడిపాడారు.

డివిజన్ ప్రజలు సహకరించాలి

గోదావరిఖని పట్టణం: తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు రూపకల్పనలో భాగంగా నగరపాలికలోని 48వ డివిజన్‌ను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు నగర మేయర్ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ నెల 7వరకు క్షేత్రస్థాయిలో సర్వే చేపడుతామన్నారు. వారికి సహకరించాలని డివిజన్ ప్రజలను కోరారు.

మూడు కిలోమీటర్లు.. ముప్పు తిప్పలు



మూడు కిలోమీటర్లు.. ఏళ్ల తరబడి అవస్థలు.. వర్షం పడితే పొలం వద్దకు వెళ్లడానికి నరకమే. కమాన్‌పూర్ మండలం బాపూజీ నగర్, కిష్టంపల్లె, రాజాపూర్ రైతులు ఎదుర్కొంటున్న సమస్య ఇది. మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిపై కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధి ముగిసే చోటు నుంచి స్వర్ణకుంటకు వెళ్లే దారి సక్రమంగా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారి చౌటాగు వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర మట్టి దారి ఏటా వర్షాకాలంలో బురదగా మారుతోంది. రైతులు ప్రధాన రహదారి వద్దే వాహనాలు నిలిపి నడిచి వెళ్తున్నారు. పంటకు ఎరువులు తీసుకెళ్లాల్సిన సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ దారిని ఆనుకొని సుమారు 500 ఎకరాల వరకు పంటలు సాగు చేస్తున్నారు. భారాస ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు కాగా చౌటాగుపై వంతెన నిర్మించి వదిలేశారు.

-న్యూస్‌టుడే, కమాన్‌పూర్

షాట్‌పుట్ పోటీల్లో సత్తా చాటిన అక్కాచెల్లెళ్లు

ఓదెల, న్యూస్‌టుడే: కొలనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఉమ్మడి జిల్లా స్థాయి షాట్‌పుట్ పోటీల్లో సత్తా చాటారు. ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో బుధవారం నిర్వహించిన పోటీల్లో అండర్-17 విభాగంలో రేండ్ల సౌమ్య మొదటి స్థానంలో, ఆమె చెల్లెలు శ్రావ్య అండర్-14 విభాగం నుంచి ప్రథమ స్థానంలో నిలిచారు. వీరిద్దరూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ సదానందం తెలిపారు. వారిని ప్రధానోపాధ్యాయుడు యేసుదాసు, ఉపాధ్యాయులు అభినందించారు.


శ్రావ్య, సౌమ్య

అనారోగ్య బాధితురాలికి ఆర్థిక సాయం

మంథని, న్యూస్‌టుడే: గోదావరిఖనిలో మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న సబేరకు మంథని మండలం ఎగ్లాస్‌పూర్‌కు చెందిన రమ్య-శ్రీధర్ దంపతులు నాగయ్య ఛారిటబుల్ ట్రస్టు, భరోసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. విఠల్‌నగర్ క్లబ్ మాజీ అధ్యక్షుడు మహేందర్ పాల్గొన్నారు.

పండగ వేళ.. మెరుగైన సేవలు

ఆర్టీసీలో ముందస్తు రిజర్వేషన్‌కు అవకాశం

న్యూస్‌టుడే, కరీంనగర్ రవాణా విభాగం

బతుకమ్మ, దసరా.. తెలంగాణలో ఎంతో ప్రాముఖ్యం గల పండగలు. వీటిని పురస్కరించుకొని ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేసేందుకు కరీంనగర్ రీజియన్‌లో టీజీఎస్‌-ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంతోపాటు సంస్థకు ఆదాయాన్ని పెంచడం, ప్రయాణికుల రద్దీని తట్టుకొని మెరుగైన సేవలు అందించాలనే సంకల్పంతో ప్రత్యేక బస్సులను నడుపుతోంది. పండగల నేపథ్యంలో విద్య, ఉద్యోగ, వ్యాపార, వాణిజ్య అవసరాల నిమిత్తం ఎక్కడెక్కడో ఉన్న వారు సైతం స్వగ్రామాల బాట పడుతున్నారు. మరోవైపు ఈ నెల 2 నుంచి విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. దీంతో వివిధ బస్టాండ్లలో రద్దీ పెరిగే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో కరీంనగర్ రీజియన్ నుంచి టీజీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది.



కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

రద్దీని తట్టుకోవడం సాధ్యమేనా?

■ ఇతర డిపోల బస్సులను తెప్పించడంతోపాటు కొత్తగా 33 ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులు కరీంనగర్‌-2 డిపోకు అందుబాటులోకి రావడం ఉపశమనం కలిగించే అంశమని భావిస్తున్నారు.

■ ఆర్టీసీ బస్సుల్లో (పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్) మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

■ మహాలక్ష్మి పథకానికి ముందు రోజు 1.50 నుంచి 2.50 లక్షల మంది ప్రయాణించగా ప్రస్తుతం ఆ సంఖ్య 4.50 లక్షలకు చేరింది. ■ బతుకమ్మ, దసరాల సందర్భంగా ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ■ ఆక్యుపెన్సీ రేషియో కూడా 95 శాతానికి పైగా ఉంటోంది. కొన్ని సందర్భాల్లో వందశాతం దాటుతోంది.

డీఎంల పర్యవేక్షణ

ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. బస్టాండ్లను శుభ్రంగా ఉంచడంతోపాటు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. డిప్యూటీ ఆర్ఎంలు, రీజియన్‌లోని 11 డిపోల డీఎంలు, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు విడతల వారీగా జేబీఎస్ బస్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. రద్దీకి అనుగుణంగా బస్సులు నడపేలా చర్యలు చేపడుతున్నారు. తిరుగు ప్రయాణంలో కరీంనగర్‌తోపాటు ఇతర బస్టాండ్లలో ఆయా డిపోల డీఎంలు ఉంటూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు 810 బస్సులు

దసరా సందర్భంగా రద్దీ దృష్ట్యా కరీంనగర్ రీజియన్‌కు సంబంధించి ఈ నెల 1 నుంచి 11 వరకు జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు 810 బస్సులు, అక్టోబరు 12 నుంచి 21 వరకు 850 అదనపు బస్సులు నడపాలని అధికారులు నిర్ణయించారు. వీటితోపాటు రోజువారీగా నడిపే బస్సులు ఆయా రూట్లలో నడుస్తున్నాయి.



www.tsrtconline.in/ www.tsrtcbus.in / oprs.web సందర్శించి ముందస్తు టికెట్ రిజర్వేషన్ చేసుకునే వీలు కల్పించారు.

బస్సుల్లో ప్రయాణించండి

ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేలా ఏర్పాట్లు చేశాం. రద్దీకి అనుగుణంగా బస్సులు తిప్పడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- సుచరిత, కరీంనగర్ రీజినల్ మేనేజర్

భళా.. బాలలు

జాతీయ స్థాయి స్కేటింగ్‌లో రాణింపు

న్యూస్‌టుడే, జ్యోతినగర్ (మార్కండేయకాలనీ)



పతకాలతో రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

స్కేటింగ్.. సరదా అనిపించే క్రీడ. అలా సరదాగా మొదలు పెట్టిన వారికి అదే జీవితమైంది. ఇందులో కొందరు చాలాసార్లు జాతీయస్థాయిలో ఎంపికయ్యారు. తమ ప్రతిభతో రామగుండం విద్యార్థులు ప్రశంసలు దక్కించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. ఇటీవల ఎన్టీపీసీ పర్మినెంట్‌టౌన్‌షిప్‌లోని రోలర్ స్కేటింగ్ క్రీడా ప్రాంగణంలో జిల్లా స్థాయి ఛాంపియన్ షిప్‌లో ఉమ్మడి కరీంనగర్ నుంచి సుమారు వంద మంది పాల్గొన్నారు. ఇందులో 30 మంది క్రీడాకారులు ప్రతిభ కనబరిచి ఈనెల 4, 5వ తేదీల్లో భువనగిరిలో జరగబోయే రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరిపై న్యూస్‌టుడే కథనం.

నాలుగుసార్లు జాతీయస్థాయిలో..



రోలర్ స్కేటింగ్ అంటే చాలా ఇష్టం. చిన్నప్పుడు సరదాగా అనిపించి ఇందులో శిక్షణ తీసుకున్నా. క్రమేపి ఆటపై ఆసక్తి పెరిగింది. నిత్యం సాధన చేస్తూ పలు పోటీల్లో పాల్గొంటున్నా. ఇప్పటివరకు నాలుగుసార్లు జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్‌లో పాల్గొని ప్రశంసపత్రాలు పొందాను. జిల్లా స్థాయి పోటీల్లో సుమారు ఎనిమిది సార్లు పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించా. ప్రస్తుతం భువనగిరిలో నిర్వహించే రాష్ట్ర స్థాయిలో పాల్గొని సత్తా చాటుతా. - రావుల అక్షర, విద్యార్థిని

శిక్షకుల సూచనలతో..



అయిదేళ్లుగా రోలర్ స్కేటింగ్‌లో శిక్షణ పొందుతున్నా. శిక్షకుల మార్గదర్శకత్వంలో మెలకువలు నేర్చుకుంటున్నా. ఇప్పటివరకు మూడుసార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని 4వ, 5వ స్థానాల్లో నిలిచి ప్రశంసపత్రాలు పొందా. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎనిమిది సార్లు పాల్గొన్నా. నిత్య సాధనతోనే ప్రతి క్రీడల్లో విజయం సాధించవచ్చని నమ్ముతున్నా. - ఎం.వర్షిత్ యాదవ్, విద్యార్థి

ప్రథమ శ్రేణియే లక్ష్యంగా



పంజాబ్, తమిళనాడులో నిర్వహించిన జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొని ప్రశంసపత్రాలు పొందా. జాతీయస్థాయి పోటీల్లో ప్రథమ శ్రేణిలో నిలిచి బంగారు పతకం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత కల్పిస్తూ ముందుకు వెళ్తున్నా. శిక్షకుల నుంచి సలహాలు తీసుకుంటేనే విజయం సొంతమవుతుందని నమ్ముతాను. - మణికృష్ణ, విద్యార్థి

పదహారేళ్లుగా శిక్షణ అందిస్తున్నా..



రోలర్ స్కేటింగ్‌లో గత పదహారేళ్లుగా విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నా. నిత్యం సాధన చేస్తే అనుకున్న లక్ష్యాన్ని అందిపుచ్చుకోవచ్చు. అన్ని క్రీడలతో పోలిస్తే వినూత్నంగా ఉంటుంది. ప్రతి విద్యార్థి క్రీడల్లో ఉన్నతంగా రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలకు అవకాశముంటుంది. రోలర్ స్కేటింగ్‌ను ఒలింపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులు సైతం ఆడుతారు. - కృష్ణమూర్తి, రోలర్ స్కేటింగ్ కార్యదర్శి

స్వచ్ఛభారత్ దివస్‌కు కోరుట్ల పురపాలిక ఎంపిక

కోరుట్ల, న్యూస్‌టుడే: స్వచ్ఛభారత్ మిషన్ ప్రారంభమై 10 ఏళ్లు గడిచిన సందర్భంగా బుధవారం దిల్లీలో నిర్వహించిన స్వచ్ఛభారత్ దివస్ కార్యక్రమానికి కోరుట్ల పురపాలక సంఘం ఎంపికైంది. కోరుట్ల పురపాలిక తరఫున ఛైర్‌పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ బట్టు తిరుపతి హాజరయ్యారు. తెలంగాణ నుంచి కల్వకుర్తి, సిద్దిపేట, కోరుట్ల, వరంగల్ ఎంపికయ్యాయి.



దిల్లీలో జరిగిన సభకు హాజరైన కోరుట్ల మున్సిపల్ ఛైర్‌పర్సన్ అన్నం లావణ్య

నకిలీ నోట్ల ముఠా అరెస్టు

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల పట్టణంలో నకిలీ నోట్లు చెలామణి చేస్తున్న ముఠాను పట్టుకున్నట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం కోరుట్ల పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. సెప్టెంబర్ 28న పట్టణంలోని వేములవాడరోడ్డులో కొబ్బరిబోండాల విక్రయ దుకాణం వద్దకు ఓ వ్యక్తి వచ్చి కొబ్బరి నీళ్లు తాగి రూ.500 నోట్ ఇచ్చి చిల్లర తీసుకొని వెళ్లాడు. తర్వాత డబ్బులు లెక్కిస్తుండగా రూ.500 నోట్ తేడాగా ఉండటంతో లింగం పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకునేందుకు సీఐ సురేశ్‌బాబు ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటై గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం తిలక్‌రోడ్డులో ఓ ఇంట్లో కొందరు వ్యక్తులు నకిలీ నోట్లు సరఫరా చేసేందుకు సమావేశమయ్యారని సమాచారం రావడంతో సీఐ, ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో వెళ్లి అయిదుగురు వ్యక్తులను పట్టుకున్నారు. ఇందులో ఓ వ్యక్తి రాజస్థాన్ నుంచి రూ.2 లక్షల నకిలీ రూ.500 నోట్లను తీసుకొచ్చి ఇక్కడి నలుగురు వ్యక్తులతో చెలామణి చేయించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో ఓ వ్యక్తి కొబ్బరి బోండాలు అమ్మే వ్యక్తికి, మరోవ్యక్తి రొట్టెలు అమ్మే వ్యక్తికి రూ.500 నోట్లను ఇచ్చినట్లు ఒప్పుకొన్నారు. అయిదుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద రూ.1,61,000ల విలువ గల రూ.500 నోట్లు, అయిదు చరవాణులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సీఐ, ఎస్సై, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించినట్లు పేర్కొన్నారు.



కోరుట్లలో పోలీసులు పట్టుకున్న నకిలీ రూ.500 నోట్లు

బతుకమ్మ ఆడుతూ మహిళ హఠాన్మరణం

ముత్తారం: ముత్తారం మండలం లక్కారంలో బుధవారం బతుకమ్మ వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మాదాసి స్వరూప(45) సాయంత్రం బతుకమ్మ ఆడుతూ కుప్పకూలింది. స్థానికులు గమనించి చూసేసరికే మృతి చెందింది. స్వరూప మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధ పడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మృతురాలి భర్త పదేళ్ల కిందటే మృతి చెందగా ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లయ్యాయి. పండుగ రోజు మహిళ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



స్వరూప

పెళ్లి కావడం లేదని ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

వీణవంక, న్యూస్‌టుడే : కరీంనగర్ జిల్లా వీణవంక మండలం ఎలబాక గ్రామానికి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ బొల్లం దేవేందర్‌రెడ్డి (27) పెళ్లి కాదేమోనన్న మనస్తాపంతో బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వీణవంక ఎస్సై తోట తిరుపతి కథనం ప్రకారం.. దేవేందర్‌రెడ్డికి ఇటీవల ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగం రాగా, నాలుగు నెలల నుంచి హుజూరాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్నారు. ఈ నెల 1న మంగళవారం రాత్రి ఇంటి వద్ద పురుగు మందు తాగగా బంధువులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందారు. తన కుమారుడికి పెళ్లి సంబంధాలు చూస్తున్నా కుదరడం లేదని.. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు దేవేందర్‌రెడ్డి తండ్రి సంపత్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



దేవేందర్‌రెడ్డి

వైకల్యాన్ని జయించి మూడు ఉద్యోగాలకు ఎంపిక



మధు

జగిత్యాల, న్యూస్‌టుడే: ఓ వైపు పేదరికం.. మరోవైపు అంగవైకల్యం అయినప్పటికీ లక్ష్యం కోసం వెనుతిరిగి చూడకుండా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. జగిత్యాల టాకావీధికి చెందిన అనుమల్ల మధు తండ్రి సత్యనారాయణతో పాటు ఓ వస్త్ర దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేసేవారు. గతంలో రహదారి ప్రమాదం జరగగా ఎడమకాలు మోకీలు వరకు తొలగించారు. ఆర్థిక ఇబ్బందులకు తోడు అంగవైకల్యం వెక్కిరిస్తున్నా పదో తరగతి చదివి ఆపేసి వస్త్ర దుకాణంలో పనిచేస్తూనే దూరవిద్య ద్వారా బీఏ, ఎంఏ, బీఈడీ పూర్తి చేశాడు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతుండగా మొదటి ప్రయత్నంలో రెండు నెలల కిందట గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడిగా ఎంపికై నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో పనిచేస్తున్నాడు. గతనెలలో వసతి గృహ సంక్షేమాధికారి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు రాగా జోనల్‌స్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. తాజాగా డీఎస్సీ ఫలితాలు ప్రకటించగా స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో జిల్లా స్థాయిలో మొదటిర్యాంకు సాధించాడు. గురువారం ధ్రువపత్రాలు పరిశీలించనున్నారు.

ఎస్సారెస్పీ నుంచి మధ్యమానేరుకు 12 వేల క్యూసెక్కులు

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ జలాశయం నుంచి బుధవారం సాయంత్రం వరకు వరదకాలువకు 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ మధ్యమానేరు జలాశయానికి తరలిస్తున్నారు. ఎస్సారెస్పీలోకి ప్రస్తుతం 17,860 క్యూసెక్కుల వరద వస్తుండగా స్పిల్‌వే గేట్లను మూసివేశారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో నీటినిల్వ 80.501 టీఎంసీలుగా ఉంది.

భత్యమివ్వండి.. బతకనివ్వండి

ప్రభుత్వ సాయానికి దివ్యాంగుడి ఎదురుచూపు

ఈనాడు, పెద్దపల్లి

పెద్దపల్లి జిల్లా మంథని మండలం బెస్తపల్లికి చెందిన తోకల మహేశ్‌కుమార్ వయసు 36 ఏళ్లు. చిన్నతనంలోనే తండ్రి చనిపోయారు. డిగ్రీ పూర్తి చేసిన మహేశ్ 15 ఏళ్ల కిందట జన్యుపరమైన కండరాల క్షీణత(మస్క్యులర్ డిస్ట్రోఫీ) వ్యాధి బారిన పడ్డారు. అప్పటి నుంచి ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తోంది. ప్రభుత్వం అతడికి ఇచ్చే దివ్యాంగుల పింఛను రూ.4,016, తల్లికి వచ్చే వితంతు పింఛను రూ.2,016 మాత్రమే జీవనాధారం. ఆ మొత్తం వైద్య ఖర్చులకూ సరిపోవడం లేదు. కండరాలన్నీ చచ్చుబడి మంచానికే పరిమితం కావడంతో వృద్ధురాలైన తల్లి మల్లమ్మనే అన్ని పనులూ చేస్తున్నారు. ఆమె తరచూ అనారోగ్యం బారిన పడుతుండటంతో తనకు 'కారుణ్య మరణం' ప్రసాదించాలంటూ మహేశ్ ఈ ఏడాది జనవరి 18న మానవ హక్కుల కమిషన్‌కు లేఖ రాశారు. ఇప్పటివరకు స్పందన లేకపోవడంతో దివ్యాంగుల హక్కుల చట్టం(ఆర్‌పీడబ్ల్యూడీ) 2016 ప్రకారం తనకు సంరక్షకుడి భత్యం(కేర్ టేకర్ అలవెన్స్) మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అలా ఇవ్వని పక్షంలో కారుణ్య మరణమైనా ప్రసాదించాలని విన్నవిస్తున్నారు.

> తీవ్ర అనారోగ్యంతో ఆ యువకుడు మంచానికే పరిమితమయ్యారు.. ప్రభుత్వం అందించే పింఛను వైద్యం ఖర్చులకే సరిపోవడం లేదు.. చట్టం ప్రకారం అందాల్సిన సంరక్షకుడి భత్యం ఇవ్వాలని, లేకుంటే కారుణ్య మరణానికి అనుమతించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు..

ఈనాడు కథనాలతో గూడు

కాళేశ్వరం ప్రాజెక్టులోని పార్వతీ(సుందిళ్ల) బ్యారేజీ వెనుక జలాల్లో బెస్తపల్లి గ్రామం ముంపునకు గురైంది. మహేశ్ దుస్థితిపై పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు రావడంతో అధికారులు స్పందించి మంథని పోచమ్మవాడలోని రెండు పడకగదుల గృహ సముదాయంలో ఇంటిని కేటాయించారు. ఆ తర్వాత జీవనోపాధికి సాయం అందించాలంటూ పలుమార్లు కలెక్టరేట్‌లోని 'ప్రజావాణి'ని ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. తనలాగా రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మంది కండర క్షీణత వ్యాధితో బాధ పడుతున్నందున ప్రభుత్వం అండగా నిలవాలని మహేశ్‌కుమార్ కోరుతున్నారు. పింఛను మొత్తాన్ని పెంచాలని, సంరక్షకుడి భత్యాన్ని మంజూరు చేయాలని వేడుకుంటున్నారు. ఈ విషయమై కలెక్టర్ కోయ శ్రీహర్షను 'ఈనాడు' సంప్రదించగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



తల్లితో కలిసి కలెక్టరేట్ ప్రజావాణికి వచ్చిన మహేశ్ (పాతచిత్రం)

హక్కులపై అన్నదాత ఆశలు

సాదాబైనామా కింద 1.12 లక్షల దరఖాస్తులు ■ ఆర్వోఆర్ చట్టంతో తొలగనున్న ఇబ్బందులు

ధరణి పోర్టల్‌లోని సాంకేతిక సమస్యలతో పాటు సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి మోక్షం లభించనుంది. ఆర్వోఆర్ చట్టాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి రైతులకు హక్కులకు కల్పించేందుకు ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టాన్ని సిద్ధం చేస్తోంది. పెండింగ్ భూ సమస్యలతో పాటు తెల్ల కాగితంపై రాసుకున్న దస్త్రాలకు పట్టా హక్కులు కల్పించనుంది. కొన్నేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులకు భూ యాజమాన్య హక్కుల కష్టాలు దూరం కానున్నాయి. – న్యూస్‌టుడే, పెద్దపల్లి



పెద్దపల్లి కలెక్టరేట్‌లోని ధరణి విభాగంలో ఫిర్యాదు చేస్తున్న రైతులు

మూడేళ్ల కిందట స్వీకరణ

తెల్ల కాగితంపై క్రయ విక్రయాలు సాగించిన భూములకు గత ప్రభుత్వం 2021లో మీసేవ ద్వారా సాదాబైనామాలో దరఖాస్తులు ఆహ్వానించగా ఉమ్మడి జిల్లాలో 1,12,517 మంది చేసుకున్నారు. తెల్లకాగితంపై రాసుకున్న భూ క్రయ విక్రయాలకు చట్టబద్ధత కల్పించడానికి రిజిస్ట్రేషన్లు చేసి పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాత రెవెన్యూ చట్టం రద్దయ్యాక దాని ఆధారంగా చేపట్టే సాదాబైనామాల క్రమబద్ధీకరణ ప్రక్రియను నిలిపివేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది.

ఉమ్మడి జిల్లాలో దరఖాస్తులు

పెద్దపల్లి:	35,580
రాజన్న సిరిసిల్ల:	15,056
కరీంనగర్:	26,871
జగిత్యాల:	35,010

పథకాలకు దూరం

గతంలో తెల్ల కాగితాలపై రాసుకొని కొనుగోలు చేసిన భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు లేకపోవడంతో రైతులు వివిధ అవసరాలకు ఇబ్బందులు పడుతున్నారు. రైతుబంధు, రైతు బీమా, కిసాన్ సమ్మాన్ నిధి, పంట రుణం, ఇతర సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. కళ్ల ముందే భూమి ఉన్నా పట్టా హక్కులు లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి. మరోవైపు ధరణి పోర్టల్‌లో అమ్మిన రైతుల పేర్లే కనిపించడంతో కొనుగోలుదారులకు కొత్త చిక్కులు ఎదురవుతున్నాయి. భూములు విక్రయించిన వారసులు ఎదురు తిరుగుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించడం తలనొప్పిగా మారింది.

ఆ నిబంధన తొలగిస్తేనే ప్రయోజనం

కొత్త చట్టం సాదాబైనామాలకు అవకాశం కల్పించడంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో మాదిరిగానే నిర్దేశిత రుసుం లేకుండా పట్టాదారు పాసు పుస్తకాలను జారీ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 'భూ యజమానుల వారసుల అంగీకారం' అనే నిబంధనను తొలగించాలని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. ఆ నిబంధన అమలు చేస్తే సాదాబైనామాల వల్ల కలిగే ప్రయోజనం అంతంతమాత్రమేనని విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు పేర్కొంటున్నారు.

పరిచయస్థురాలే కాజేసింది

బంగారం చోరీ కేసు ఛేదించిన పోలీసులు

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: తనకు పరిచయం ఉన్న వివాహిత ఒంటిపై కనిపించిన బంగారు ఆభరణలపై కన్నేసింది. ఎలాగైనా వాటిని దక్కించుకోవాలని పన్నాగం పన్నింది. బంధువుతో కలిసి చోరీకి పాల్పడి చివరకు పోలీసులకు చిక్కింది. కరీంనగర్ నగర ఏసీపీ జి.నరేందర్ బుధవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. పిట్టల ప్రశాంత్ (గ్రానైట్ వ్యాపారి), భార్య లహరి (గృహిణి)లు కరీంనగర్ ప్రగతినగర్‌లో ఉంటున్నారు. సెప్టెంబర్ 24 మధ్యాహ్నం లహరి బయటకు వెళ్లి రాగా ఇంటికి మరోవైపు ఉన్న తలుపు తీసి ఉంది. బీరువాలోని 187 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏసీపీ నరేందర్, సీఐ విజయ్‌కుమార్‌లు కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీఎస్, రెండో ఠాణా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించారు. బాధితురాలు లహరి, నిందితురాలు త్రిపురాని లహరి అలియాస్ శిరీష గతంలో రాంనగర్‌లో పక్కపక్కనే అద్దెకు ఉన్నారు. లహరి మరో ఇల్లు మారినా.. శిరీష వెళ్లి పలకరిస్తుండేది. గణేశ్ నవరాత్రుల సందర్భంగా లహరి ఒంటిపై బంగారు ఆభరణాలను గమనించిన శిరీష.. ఎలాగైనా వాటిని దక్కించుకోవాలనుకుంది. చోరీ జరిగే ముందు రోజు లహరి ఇంటికి వెళ్లి ప్రధాన ద్వారం కాకుండా పక్కన ఉండే మరో ద్వారం బేడం తీసి వచ్చింది. ఎప్పుడు ఆ ద్వారంను ఉపయోగించకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు దృష్టి సారించలేకపోయారు. 24న ఇంట్లో ఎవరూ లేని సమయంలో శిరీష మంచిర్యాల జిల్లా భీమారం మండలం ఖాజీపూర్‌కు చెందిన తన మేనబావ చిలుకాని రాజశేఖర్‌తో కలిసి ఇంట్లోకి చొరబడి బంగారాన్ని అపహరించింది. సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించిన పోలీసులు వారిని కరీంనగర్ తెలంగాణచౌక్ వద్ద పట్టుకున్నారు. 187 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకొని ఇద్దరినీ జైలుకు పంపించినట్లు ఏసీపీ తెలిపారు. సీసీఎస్ ఏసీపీ కాశయ్య ఉన్నారు.



నిందితుల అరెస్టు చూపుతున్న ఏసీపీలు నరేందర్, కాశయ్య

క్షణికావేశం అన్న ప్రాణం తీసింది!

■ కుమారుడిని చంపుతాననడంతో తమ్ముడి దాడి?

■ అంతర్గాం హత్యోదంతంపై పోలీసులకు స్పష్టత

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : జగిత్యాల మండలం అంతర్గాంలో మంగళవారం రాత్రి హత్యకు గురైన విద్యాసాగర్‌రాజు కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు తెలిసింది. మృతుడి సోదరుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా తన కుమారుడిని చంపుతానని బెదిరించడంతో క్షణికావేశంలో హత్య చేసినట్లు ఒప్పుకొన్నట్లు సమాచారం.. విశ్వసనీయ సమాచారం మేరకు.. అంతర్గాంకు చెందిన నన్నపనేని రమేశ్‌రాజు దంపతులకు విద్యాసాగర్‌రాజు, విక్రమ్‌రాజు ఇద్దరు కుమారులు. వీరిది ఉమ్మడి కుటుంబం కాగా పెద్ద కుమారుడు పదేళ్ల కిందట దుబాయికి వెళ్లాడు. అక్కడ మద్యానికి బానిసై అప్పులు చేయగా అతడికి రూ.5 లక్షలు పంపించడంతోపాటు భూమి అమ్మి మరో రూ.20 లక్షలకుపైగా అప్పులు చెల్లించారు. మూడేళ్ల కిందట స్వగ్రామానికి వచ్చిన విద్యాసాగర్‌రాజును కుటుంబ సభ్యులు పెళ్లి చేసుకోవాలని సూచించినా నిరాకరించాడు. విక్రమ్‌రాజుకు వివాహం కాగా ఒక బాబు జన్మించాడు. విద్యాసాగర్‌రాజు మద్యానికి బానిసై నిత్యం డబ్బుల కోసం తండ్రిని అడగటం ఇవ్వకపోతే చంపుతానని బెదిరించటం అలవాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తల్లిదండ్రులపై దాడి చేసి చంపుతానని బెదిరించటంతో వారు ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఒంటరిగా ఉన్న తమ్ముడితో అన్న గొడవకు దిగాడు. అమ్మానాన్నను ఎక్కడ దాచావంటూ బెదిరించాడు. భూమి అమ్మి డబ్బులు ఇవ్వాలని బెదిరించి తీవ్ర వాగ్వాదానికి దిగాడు. తమ్ముడిని, అతడి కుమారుడిని కూడా చంపుతానని బెదిరించాడు. దీంతో విక్రమ్‌రాజు విద్యాసాగర్‌రాజు తలపై రోకలి బండతో కొట్టడంతో మృతి చెందినట్లు పోలీసుల విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. కుమారుడి హత్య గురించి తెలుసుకుని తల్లిదండ్రులు బుధవారం ఇంటికి చేరారు. కేసును జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సదాకర్ దర్యాప్తు చేస్తున్నారు. సీఐ కృష్ణారెడ్డిని హత్య కేసు విషయమై వివరణ కోరగా గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తామన్నారు.

నవోదయలో ప్రవేశానికి గడువు పొడిగింపు

చొప్పదండి : నవోదయ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 7 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపల్ మంగతాయారు ఓ ప్రకటనలో తెలిపారు. 8, 9 తేదీల్లో దరఖాస్తుల్లోని పొరపాట్లు సవరించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.